# నందనవనం - 11

అనుకున్నట్లుగానే షాపు పనులు ప్రారంభం అయ్యాయి.

రామం ఓ చిన్న షెడ్డులాంటిది ఏర్పాటు చేయటానికి అంగీకరించలేదు, రామం ఆలోచనతో సూర్యం తోడ్పాటుతో ఓ చిన్న సైజు మాల్ ఏర్పాటయింది. బ్యాంకు లోను వ్యవహారాలన్నీ రామం, సూర్యం చూసుకున్నారు. ఆ పని మీద ఇద్దరూ చాలాసార్లే తిరిగారు.

చివరకు మాల్ ప్రారంభం అయింది.

అందంగా అమర్చిపెట్టిన ప్యాకెట్లనూ, సరుకులను చూసి, మూడు ఊళ్ళ వాళ్ళూ బాగా ముచ్చట పడ్డారు. రవళికి తోడుగా ఇంకో ఇద్దరు అమ్మాయిలూ పనిచేయటానికి ఉత్సాహంగా ముందుకు వచ్చారు.

ఆ జనం, అంత హడావుడీ చూసి శ్రీవల్లి చాలా ఆశ్చర్యపోయింది. అప్పటిదాకా అసలు జరుగుతుందా లేదా అనే ఆలోచనతో చాలా సతమతమైంది! అలాంటిది మొదటిరోజే అంత ప్రోత్సాహకరంగా ఉండటంతో ఉబ్బితబ్బిబ్బయింది! ఇలాంటి ఆలోచన మనకెందుకు రాలేదూ ఇన్నాళ్ళూ అని కొందరు అనుకోవటమూ విని సంతోషించింది!

క్రమంగా అమ్మకాల్లో ఇంకా పుంజుకుంటుందేగానీ వెనకడుగు వేయాల్సిన అవసరం ఉండదని ధీమా ఏర్పడటంతో ఇంకా ఇంకా ఎలాంటి సౌకర్యాలూ, ఏర్పాట్లూ చేయవచ్చో - అని ఏవో పథకాలను మనసులోనే సిద్ధం చేసుకుంది.

రవళి శ్రీవల్లిని అడిగింది ''అమ్మా... ఏదో చిన్నది అయితే ఫరవాలేదుగానీ, ఇలాంటి మాల్ లో నాకు భాగస్వామ్యం ఏమిటమ్మా... వద్దు. మిగతా ఇద్దరితో పాటు నాకూ జీతం ఏర్పాటు చేయండి...!''

''అదంతా తర్వాత ఆలోచించుకోవచ్చులే. రామం, సూర్యం 'పెట్టుబడి ముందు రానీ... అది తీసేసాక... ఆలోచిద్దాం' అన్నారు. ఈ లోపుగా బాగా కష్టపడుతున్న వాళ్ళకీ మంచి జీతాలు ఏర్పాటు చేద్దాం..'' అంది.

ఒక క్షణం ఆలోచించిన తర్వాత... శ్రీవల్లి మళ్ళీ చెప్పింది, ''మీ ముగ్గురికీ పెళ్ళిళ్ళు నిశ్చయమయ్యాయి.. ఎవరు, ఎక్కడ స్థిరపడతారో ఇపుడే తెలియదు. ఈ లోపుగా ఆసక్తి ఉన్న వాళ్ళని చూసుకుని... పనులన్నీ నేర్పితే మంచిదేమో అనిపిస్తోంది..!''

రవళి శ్రీవల్లి వైపు సంశయంగా చూస్తూ అడిగింది ''అమ్మా.... ఒకమాట. మీరు చదువుకున్నారూ, ఏదో ఉద్యోగం చేశారనీ తెలిసింది కదా.... ఎందుకు మానేశారూ? పెళ్ళవగానేనా..?. వద్దన్నారా..?

శ్రీవల్లి నవ్వుతూ చూసింది. ''నీ భావం అర్థమైంది. ఈ రోజుల్లో.. ఉద్యోగం అనేది కేవలం మన ఇష్టప్రకారం ఉండాలిగానీ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని వదులుకుని బానిసల్లా బ్రతకకూడదని కొందరు ఆడవాళ్ళు అంటున్న మాట నిజమే కానీ ఎవరి ఇష్టాలు, అభిప్రాయాలు వాళ్ళవి...మనమీద మరొకరి పెత్తనం, నిర్బంధం ఉండటం ఎవరికైనా నచ్చదు! అది నిజం...! అయితే చాలామంది... కాకపోతే కొందరయినా భర్త పెత్తనాన్ని అంగీకరించినట్లు కనిపిస్తూనే... అసలైన అధికారాన్ని చలాయిస్తారు ! లౌక్యం తెలిసిన వాళ్ళ పద్ధతి అది!

కొంతమంది ఏ విషయంలోనూ తమ మాట నెగ్గించుకోలేక లోలోన కుమిలిపోతుంటారు! తెగింపు, ధైర్యం బాగా తక్కువ! నా ఉద్దేశ్యంలో అయితే.. ఈ రోజుల్లో ఇలాంటి వాళ్ళు అరుదుగా మాత్రమే ఉంటారనుకుంటున్నాను! ఎవరమైనా పొద్దస్తమానూ ఖాళీగా కూర్చోలేంగా, అది మంచి పద్ధతికాదు. ఇంట్లో పనో, బయటదో చేయాల్సిందే ! బాగా డబ్బుంటే... ఏ పనీ చేయనక్కర్లేదని కొందరు ఆపోహ పడుతూంటారు! వాళ్ళకే ఎక్కువ బాధ్యతలు, సమస్యలు ఉంటాయి. శారీరక శ్రమ తక్కువే ఉండొచ్చు గానీ చికాకులు ఎక్కువే వాళ్ళకి.. మనిషన్నాక కష్టమూ, సుఖమూ అన్నవి మాత్రం తప్పవు... ఇది నిజం! ఇక కొందరు ఫలానా ఉద్యోగమే చేయాలని అనుకోరు. మనసుకు నచ్చిన మంచి వ్యాపకం ఉంటే చాలనుకుంటారు! ఎవరి ఇష్టాన్ని బట్టి వాళ్ళకు అలాగే జరిగితే, అంతకన్నా కావల్సిందేం ఉంటుందీ? ఉద్యోగం ఎంత గొప్పది అయినా చేస్తూ స్వతంత్రంగా బ్రతకాలనే ఆలోచన రాదు ఇలాంటివాళ్ళకి అంటే.... నాలాంటి వాళ్ళకన్నమాట. అర్థమైందా....ఒక్క చిన్న ప్రశ్నకి ఎంత పెద్ద జవాబు ఇచ్చానో'' అంటూ శ్రీవల్లి చిన్నగా నవ్వింది.

రవళి కూడా చిన్నగా నవ్వుతూ అంది ''మీరు ఏదైనా విపులంగా చెప్పగలరని అనుకుంటానంతే నమ్మా...! మీలాంటి వాళ్ళ పరిచయం కలగటమే, నాలాంటి వాళ్ళకు గొప్ప భాగ్యం..!''

శ్రీవల్లి మురిపెంగా రవళి తల నిమిరింది.

* * *

పొలంలోకి దిగి నాట్లువేస్తూ, కూలీలతోనూ వేయిస్తున్న ఆయనను చూసి పొలంగట్టుపై ఇద్దరు ముగ్గురుతో కలిసి వెళ్తున్న భద్రయ్య ఒక క్షణం ఆగాడు. ''ఏంది

సుబ్బయ్యా...... నీ కంటికి మేం ఆనలేదా... పరిచయమే చేసుకోలేదూ..?'' నవ్వు మొహంతో సరదాగా అన్నాడు.

ఆయన గట్టుమీదకి వచ్చాడు. భద్రయ్యను.... కొత్తగా చూస్తూ ''ఊరువాళ్ళందరితోనూ పరిచయంచేసుకోవాలనే ఉందిగానీ... వీలును బట్టి కలుద్దామని అనుకుంటున్నా..!'' అంటూ నసిగాడాయన.

''పొరుగూరులో ఉండే పరమేశ్వంగారిని తండ్రీ కొడుకులిద్దరూ కలిసి వచ్చారని విని.... ఈ ఊళ్ళో ఉండే నేను... ఏమనుకోవాలీ ! నాలాంటి వాళ్ళు నీ స్థాయికి తగినవాళ్ళం కామా అనే అనుమానం వచ్చి .. అలా అడిగా నంతే, సరదాగా అనుకో...'' అంటూ ఫెళ్ళున నవ్వాడు. మళ్ళీ... ''అవునూ.... మీ నాన్న ఎంతో కష్టపడి సంపాదించిన ఆస్తిపాస్తులు ఎలా పోయాయీ...? అసలు ఆవార్త నిజమేనా?'' అని అడిగేసరికి ఏమీ జవాబు చెప్ప లేనివాడిలా ఆయన తలవంచుకున్నాడు.

''సరేలే.... నీ పరిస్థితి చూస్తేనే విషయం నిజమేనని అర్థమౌతోందనుకో... ఏదో మామూలుగా అడిగానంతే ! ఇలా ఎండావానల్లో ఏం ఒళ్ళొంచగలవూ... అలవాటు లేని పనిగదా.. ఇంకేదైనా నీడపట్టున కూర్చుని చేయగల వ్యాపారమో, మరొకటో ఆలోచించకపోయావా? ఇలాంటి కష్టాన్నెందుకు ఎంచుకున్నావూ...?''

భద్రయ్య చూపించిన సానుభూతికి ఆయన చిరునవ్వుతో తలెత్తి చూశాడు.

''నాకిది చాలా ఇష్టమైన కష్టమే! మనిషిగా పుట్టిన ప్రతీవాడూ ఆకలికి ఆహారం తినాల్సిందే ! అందుకే... మనవాళ్ళు పంటలు పండించే రైతుల్ని అన్నదాతలన్నారు!

ఎవరమైనా తలవంచి నమస్కరించాల్సిన వృత్తి కదండీ! నిజానికి అన్ని వృత్తులూ మనిషి మనుగడకు అవసరమే అయినా ప్రథమస్థానం మాత్రం రైతుకే ఇవ్వాలని నా ఉద్దేశ్యం!''

భద్రయ్య ఆయన చేయి పట్టుకుని ''చాలా మంచి మాట చెప్పావు సుబ్బయ్యా ! 'సుబ్బయ్యా' అంటున్నానని ఏం అనుకోకు. నేను నీకంటే పెద్దవాడినే కదా! నీకు తెలియకపోవచ్చుగానీ, మా నాన్న ద్వారా ఆరోజుల గురించి, మీ తాతగారి గురించీ నేను చాలా విశేషాలే విన్నాను! మీ తాతగారు అరుగులబడి అయ్యవారుగా పేరు పొందారు గానీ మా తాత... ఎంత కష్టపడ్డా వ్యవసాయంలో లాభం లేకపోవటంతో దూరప్రాంతానికి వలస వెళ్ళిపోయాడు. నీలాగే నేనూ ఇక్కడ పుట్టిన వాడిని కాకపోయినా, తాత ముత్తాతల ఊరనే అభిమానంతో ఇక్కడికే వచ్చి స్థిరపడ్డాను! నా గురించి ఇంతకన్నా ఎక్కువ ఏం చెబుతాలే.... నీక తెలుస్తుంది!'' అన్నాడు ఆప్యాయంగా.

ఆయనకీ చాలా అభిమానం కలిగింది, ఆనందంగా బదులు చెప్పాడు, ''మీరు సుబ్బయ్యా.... అని పిలిస్తే.... నాకేం ఇబ్బందిలేదు.. మరి నా పేరు అదే కదా! ఇష్టంగానే ఉంటుంది. మన మధ్య స్నేహం ఏర్పడాలనే కోరుకుంటున్నాను. నేను రేపే వచ్చి కలుస్తాను మిమ్మల్ని.''

''భలేవాడివే... నువ్వు పనిగట్టుకుని రానవసరం లేదు. ఇక పరిచయం చేసుకోవటం ఏముందీ... అది జరిగిపోయిందిగా... నువ్వన్నట్లు స్నేహాన్ని పెంచుకోవటమే మిగిలి ఉంది. ఈ పొలం పనులేపైనా ఉంటే... ఎవరికైనా అప్పగించే ఏర్పాటు చేసుకుని రేపు ఖాళీగా ఇంటిదగ్గరే ఉండు... నేనే వస్తాను, మీ ఇంటికి భోజనానికి. మీ శ్రీమతి చేతివంట చాలా రుచిగా ఉంటుందని విన్నాను కూడా !'' అనే సరికి ఆయన ఆనందంగా ''తప్పకుండా రండి. ఆవిడకు వండి వడ్డించటం ఎంత

ఇష్టమో, నాకూ ఇష్టమైన వాళ్ళతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయటం అంతే ఆనందంగా ఉంటుంది..'' అని చెప్పాడు.

అనుచరులతో కలిసి భద్రయ్య బయలుదేరి వెళ్ళగానే పొలంలో పనిచేస్తున్న వాళ్ళు అతని వివరాలు చెప్పుకొచ్చారు. ఆయన ఆ ఊరి ధనవంతులలో ఒకరు. ఊళ్ళోని భాగ్యవంతులైన నలుగురి మధ్య .. ఎప్పుడూ ఆధిపత్యపోరు జరుగుతూ ఉంటుందట ! తమ సలహా, సూచనలు పాటించేవాళ్ళు ఎక్కువమంది ఉంటే... వాళ్ళే ఆ ఊరుకి పెద్దలుగా చలామణీ కావచ్చనే అభిప్రాయంతో ఉంటారు! వాళ్ళందరి మధ్యా ఏవో లావాదేవీలూ ఉంటూంటాయనీ చెప్పటం జరిగింది..

చెప్పినట్టుగానే భద్రయ్య ఆరోజు భోజనానికి వచ్చాడు. ఏవో కూరగాయలూ, పళ్ళూ మనుష్యులతో పట్టించుకుని వచ్చి నట్టింట్లో పెట్టించాడు.

ఆదరంగా అందర్నీ పలకరించాడు.

శ్రీవల్లిని చూసి ''చెల్లెమ్మా.. మా నాన్నగారు చెప్పిన మాటల్ని బట్టి... అచ్చం నువ్వు ఈ సుబ్బయ్య నాన్నమ్మలాగే ఉన్నావనిపిస్తోంది! ఆవిడను చూసిన వాళ్ళెవరైనా 'అమ్మా....' అంటూ చేతులెత్తి దండం పెట్టకుండా ఉండలేరట ! కొందరి రూపు రేఖల్లోనే అంత శక్తి ఉంటుందనే మాట నిజమని ఇపుడు నిన్ను చూశాకనే నాకూ అర్ధమైంది తల్లీ...! '' అన్నాడు.

భార్యా భర్తలిద్దరి వదనాలు వికసించాయి.

''మీరింత ఆదరంగా పలకరిస్తోంటే...నాకూ... స్వంత అన్నయ్య భోజనానికి మా ఇంటికి వచ్చినంత ఆనందంగా ఉందండీ!'' అంది శ్రీవల్లి.

భద్రయ్య నవ్వి ‘‘కొందర్ని చూసీ చూడగానే మనవాళ్ళనే అభిప్రాయం ఏర్పడి.... ఆత్మీయత కలుగుతుంది! అందుకే సుబ్బయ్యతో చనువుగా భోజనానికి వస్తానని భేషజం లేకుండా చెప్పేసాను. మొహమాటం లేకుండా అలా అడగడమేమిటనుకునే బాపతు మీరు కాదని నాకు మొదటిసారి చూడగానే అర్థమైపోయింది! చెల్లెమ్మా.. ఇంకో కారణం కూడా ఉంది. అదీ చెప్పేస్తా. ఈ ఊళ్ళో వాళ్ళు నీ గురించి చెప్పింది విని... నిన్ను చూడాలనీ, నీ చేతి వంట తినాలనీ అనుకున్నాను!’’

ఆ మాటలకు శ్రీవల్లి మొహం విరబూసిన మందారమే అయింది. ఆనందంతో కళకళలాడింది కూడా.

లోపలనుండి కుర్చీ తేబోతోంటే వారించాడు. అరుగుమీద ఒక పక్కగా కూర్చుని ‘‘మీరిద్దరూ మీ అబ్బాయితో ఈ ఇంట్లోనే ఉండాలని నిర్ణయించుకోవటం వలన ఈ అరుగుమీద కూర్చునే అవకాశం, అదృష్టం కలిగాయ్!’’ అన్నాడు ఆనందంగా.

ఆయన లోపలనుండి తెచ్చిన కుర్చీని అలాగే ఉంచి... భద్రయ్యకు ఎదురుగా, పక్క అరుగుమీద కూర్చున్నాడు. శ్రీవల్లి భోజన ఏర్పాట్లు చేయటానికని లోపలకు వెళ్ళబోతూండగా ఆవిడతో భద్రయ్య ‘‘చెల్లెమ్మా.... ఒక్క క్షణం... ఆ గుమ్మం దగ్గరే నిలబడు తల్లీ...!’’ అన్నాడు.

‘‘వడ్డన ఏర్పాటు చేద్దామనీ....’’ అంది మెల్లగా శ్రీవల్లి నసుగుతున్నట్లు.

‘‘అపుడే వద్దులేమ్మా... అంత తొందరేం లేదు. నేను చెప్పే మాటలు రెండు విని వెళ్ళు.’’ అని అనేసరికి ఇద్దరికీ కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది.

వాళ్ళ ఆశ్చర్యం చూసి చిన్నగా నవ్వి భద్రయ్య మొదలు పెట్టాడు. ''ఇలా ఇక్కడ కూర్చుంటే... మా నాన్న చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. ఇపుడు మీకూ చెప్పాలనిపిస్తోంది. సరిగ్గా చెప్పలేనేమో గానీ, ప్రయత్నం చేస్తాను! ఇదొక రోజు జరిగిన చిన్న ప్రహసనం లాంటిదన్నమాట. నాన్న చాలాసార్లే చెప్పాడు. సింహద్వారానికి ఒక పక్కగా... ఈ అరుగుపైన వ్రేలాడదీసిన చెక్కపలకపై 'ఆనందమే జీవిత పరమావధి... పరోపకారమే వ్రతవిధీ'- అనే సూక్తి ఇపుడు ఉందా.... అప్పుడు.. ఆ రోజుల్లోనూ ఇలాగే ఏవో సూక్తులు రాసి ఉండేవట, ఆ పెద్ద పడక కుర్చీలో... అయ్యవారు కూర్చుని బెత్తాన్ని ఆడిస్తూ... నేలపై తాటిస్తూ  రెండు అరుగుల నిండా కూర్చున్న పిల్లలందర్నీ పరికించి చూసి పరామర్శించే తీరు ఇలా ఉంటుంది! 'ఏరా... కామేశం.... ఈ పూట ఇంటిదగ్గర ఏమీ తిని రాలేదా.... అలా ఆకలిగా కనుపిస్తున్నావు...' అని అతడిని పలుకరించీ, మరొకడిని 'మాధవయ్యగారి మనవడా... మొన్న మీ అమ్మగారు నీకు ఒళ్ళు వెచ్చబడిరదని చెప్పారే... అపుడే బడికి వచ్చేశావూ... నీరసం తగ్గిపోయిందా? ఏమైనా బడి అయ్యాక ఆటలూ పాటలూ అంటూ కూర్చోక ఇంటికి పెందరాలే వెళ్ళిపో... నేనూ గమనిస్తా' అంటూ హెచ్చరించేవారట! 'ఒరే నీకు లెక్కలు సరిగా అర్థం కావటం లేదంటున్నావుగా, బడి అయ్యాక వెంటనే ఇంటికి పరుగుపెట్టేయకు, కాసేపు కూర్చుంటే, నీకు మరోసారి విపులంగా చెబుతాలే... సరేనా...' అంటూ ఇంకొకడనీ అలా అందర్నీ ఆరాగా పలుకరించటం అయ్యాక గానీ పాఠం మొదలు పెట్టేవారు కాదట!

అమ్మగారు  అప్పుడు చెల్లెమ్మ ఇప్పుడు తలుపు దగ్గర నిలబడినట్లే నిలబడి... పిల్లల వైపు ఓ మారు చూసి 'కేశవా... నువ్వు పరుగున వెళ్ళి నేను అడిగానని  చెప్పి మీ పెరట్లోని కరివేపాకు మొక్క నుంచి ఓ గుప్పెడు రెమ్మలు తెంపుకుని రా నాయనా...' అని చెప్పగానే అయ్యవారు ఆవిడ వైపు పరిహాసంగా చూస్తూ 'దేముడి దర్శనం తర్వాతనే ప్రసాదం అనే తీరు ఉంటుంది! నువ్వేమో ముందే ప్రసాదం అనే రకంలో

ఉన్నావ్. పాఠం మొదలవ్వక ముందే ప్రసాదం పెట్టేద్దామనే తొందరలో పిల్లలకీ పనుల పురమాయింపులేవిటీ...?' విసురుగా అనగానే, ఆవిడ నుండి ఠక్కున సమాధానం వచ్చేసేది!

'ముందే ప్రసాదం అని మీరే ఆశపడుతున్నట్లు నాకనిపిస్తోంది.! వాడు కరివేపాకు తెచ్చాకనే కదా, నేను తాలింపు పెట్టి... పులిహోర కోసం, అన్నంలో కలియ బెట్టాలీ! అంతా కలగలిపి కాసేపు వూరబెట్టాకనే, కదా ఎవరికైనా పెట్టేదీ! అసలు సంగతి మరిచేపోయా! ఈ వేళ శుక్రవారం ... అమ్మవారికి  ముందు నైవేద్యం అయ్యాకనే పిల్లలకీ ప్రసాదం!' అని అమ్మగారు అనగానే  'అనుకున్నాలే.... ఈ రోజు పులిహోర నైవేద్యం ఉంటుందనీ!... ఏరా, కేశవా అలా చూస్తూ నిలబడ్డావే, పరిగెత్తుకునిరా... ఇక్కడున్నట్లే రావాలి మరి....!' అని అయ్యవారు అంగీకారం తెలియపరచేసరికి వాడు అమ్మగారి వైపు చూసి 'మరి... నేనొచ్చే వరకూ అయ్యవారిని పాఠం చెప్పొద్దని చెప్పండమ్మా...!' అంటూ నసగటం ఆవిడకు కొంచెం ఆశ్చర్యం కలిగించింది! బుగ్గన చేయి వేసుకుని మరీ ఆశ్చర్యపోతూ 'అబ్బో... నీకు పాఠాలు వినటమంటే నిజంగానే ఇంత శ్రద్ధ ఉందా...?' అనడిగింది.

కేశవ అనబడేవాడు 'అయ్యవారు పాఠంతో పాటు  కథలు కూడా చెబుతారు కదండీ...! అనేసరికి, ఆవిడ ఫక్కున నవ్వేసి 'సరేరా... పాఠం మొదలు పెట్టకుండా నే చూస్తాగా, నువ్వు పరుగున రా...' అంది. వాడు పరుగు పెట్టేసేవాడు.

'ఒరే, వెంకన్నా... నువ్వు మంగమ్మగారింటికి వెళ్ళరా... ఆవిడ వాళ్ళింట్లో అరటి చెట్టు గెలవేస్తే, నిన్ననే కోయించారని చెప్పింది. చెట్టునీ కొట్టేయించి వుంటారు.... నాలుగు ఆకులు ఆ అరటి చెట్టుపే కోసి తీసుకురా....' అని పురమాయించగానే అయ్యవారు కొంచెం వేళాకోళంగా 'ఇక అందరికీ తలా ఓ పని పురమాయించెయ్యి. నేను మాత్రం

ఖాళీగా ఎందుకూ, ఏదో ఒకటి చెప్పు చేసేస్తా' అనేవారట! ఆవిడ గలగల నవ్వేసి 'మీరు చేయాల్సిన పెద్ద పని తినటమే...' అంటూ లోపలకు వెళ్ళిపోవడం జరిగేదట!

ఆ తర్వాత... విరామం సమయంలో ఓ పెద్ద బేసిన్ నిండా పులిహోర పెట్టుకుని ఆవిడ అరుగుల దగ్గరికి రాగానే ఓ నలుగురు పిల్లలు అరటి ఆకు ముక్కలు అందుకుని వాటిల్లో అమ్మగారు వడ్డించిన ప్రసాదాన్ని మిగతా ప్లిలలకి అందించటం జరిగేది.

ఆవిడ అలా వారానికి నాలుగురోజులైనా చక్కరపొంగలి, పులిహోర లాంటి ప్రసాదాలు మాత్రమే కాకుండా దోరజామ, బొప్పాస లాంటి పండ్లముక్కలూ పంచటం చేసేవారు. పనసపండు, సపోటాల్లాంటివో ఎవరైనా పంపించినప్పుడు అవికూడా పిల్లలకీ అందేవి. అలా పంచటం అనేది అమ్మగారికీ, పిల్లలకీ అందరికీ ఇష్టమైన కార్యక్రమంగా ఉండేది!

మునుపటి రోజుల్లో పెద్దవాళ్ళకి, తమకి ఉన్నది పదిమందితో పంచుకోవటమనే మంచి అలవాటు ఉండేది ! ఇపుడది క్రమంగా బలహీనపడుతోందేమోననే' అనుమానం వస్తూ ఉంటుంది నాకు...!'' అంటూ భద్రయ్య చెప్పటం ముగించగానే...

పక్కనే కూర్చున్న ఆయన, భద్రయ్య చేతిని ఆత్మీయంగా అందుకుని ''ఇలాంటి గొప్ప విషయాల్ని మనం మరిచిపోకుండా నెమరేసుకుంటూండటమే గాదు, పిల్లలకు వీలైనప్పుడల్లా చెబుతూండాలి అలా చేయటం మనం... వాళ్ళలోనూ విలువల మొలకల్ని నాటి, అవి అంతరించి పోకుండా నీళ్ళు చిలకరించటం లా ప్రయోజనకరంగా ఉంటుంది'' అన్నాడు సుబ్బయ్య.

ఆ మాటలకు నిలువెల్లా పులకరించిపోయినట్లు సుబ్బయ్య, ఆయనను ఆత్మీయంగా హత్తుకున్నాడు.

గుమ్మంలో నిలబడిన శ్రీవల్లి ‘‘పెద్దల కబుర్లు ఇద్దరూ పారాయణం చేసుకోవటం చాలించి... ఇక భోజనాలకి వస్తారా..?’’ అని చిరునవ్వుతో అడిగింది.

ఇద్దరూ నవ్వు మొహాలతో లోపలికి నడిచారు.

శ్రీవల్లి వడ్డనకు ఏర్పాటు చేస్తుంటే... భద్రయ్య ఆయన వెంట ఇల్లంతా తిరిగి అణువణువూ పట్టిపట్టి చూసినట్లుగా పరికించి చూశాడు. తన తండ్రి చెప్పిన మాటలవల్ల అయ్యవారి పట్ల మాత్రమే కాకుండా ఆయన నడయాడిన ఇంటిమీదా అంతే శ్రద్ధాసక్తులు ఉన్నాయని వాళ్ళిద్దరూ చాలా ఆనందించారు.

తరువాత భోజన కార్యక్రమం జరిగింది.

శ్రీవల్లి వడ్డించిన ప్రతీ వంటకాన్నీ భద్రయ్య సంతృప్తిగా తింటూ మెచ్చుకున్నాడు. రామాన్ని తీసుకుని వాళ్ళిద్దరూ కూడా తమ ఇంటికి రావాలని ఆహ్వానించాడు. తమ రెండు కుటుంబాల మధ్యా స్నేహబంధం ఏర్పడాలనేదే తన కోరికని మరీ మరీ చెప్పాడు.

వీళ్ళూ కూడా ‘అదే తమ అభిప్రాయమూ’ అని ఆనందంగా అంగీకరించారు.

* * *